# లిఫ్ట్

విన్నకోట సుశీలాదేవి

"హలో! గుడీవినింగ్ మేడమ్!"

లత తలతిప్పి చూసింది.

అతడే...నల్లప్యాంటు.... ఎర్రగళ్ల చొక్కా, మెడలో కర్చీఫ్...నోట్లో సిగరెట్-కళ్లకు పెద్ద గాగుల్స్. ఒక కాలు మోటార్ సైకిలు మీద-మరో కాలు నేల మీద ఆన్చి నిలబడ్డాడు.

అతడిని చూడగానే మండిపోయింది లతకు. విసురుగా ఏదో అనబోయింది. కానీ అతికష్టం మీద కోపాన్ని ఆపుకుంది.

అతడు నోట్లోంచి సిగరెట్ తీసి చేతిలో పట్టుకున్నాడు.

"మేడమ్!లిఫ్ట్ కావాలా?" విలాసంగా పొగవదుల్తూ అన్నాడు.

అతడి చెంప ఛెళ్ళుమనిపిద్దామనుకుంది. కానీ ధైర్యం చేయలేక పళ్ళు కొరుక్కుంటూ వుండిపోయింది.

"మేడమ్! ఏమిటింకా ఆలోచన బస్సు ఇప్పుడిప్పుడే రాదు. కమాన్! రండి! కన్నుగీటుతూ అన్నాడు.

అతడి తీరు లతకు కోపం-బాధ- అవమానాన్ని కలిగించాయి.

అతడు ఇప్పటికి దాదాపు మూడు నెలల నుండి సాయంత్రం వేళలో- ఈ బస్సుస్టాపులో కనబడుతూనే వున్నాడు.

మొదట్లో తనని చూసి నవ్వేవాడు. ఆతర్వాత 'గుడ్‌మార్నింగ్'చెప్పేవాడు. "ఈమధ్య లిఫ్టిస్తాను రండి" అని పిలవడం మొదలెట్టాడు.

అతడి వ్యవహారం కోపాన్ని కలిగిస్తున్నా అతడినేమీ అనలేకుండా వుంది.

తను వుద్యోగం చేస్తున్నా- ఆడపిల్ల- అశక్తురాలు. అతడు రౌడీలా వున్నాడు. తనేదైనా అంటే అతడు మరీ మితిమీరి పోవచ్చు. తనని ఆదుకునే వారెవ్వరూ వుండరు. ఆ భయమే తన నోరు నొక్కేస్తోంది. అతడెంత అవమాన కరంగా మాట్లాడినా భరిస్తోంది.

రోజూ బస్సుస్టాపు జనంతో కిటకిటలాడుతూ వుండేది. కానీ ఈ రోజు తనకు ఆఫీసులో ఆలస్యమైంది. తను బస్సుస్టాపుకు వచ్చేసరికి చాలా బస్సులు వెళ్ళిపోయాయి! ఇవ్వాళ తనకు ఆలస్యమైంది కాబట్టి "అతడి" బారి నుండి తప్పించుకుందని సంతోషించింది. కానీ అతడు మళ్ళీ తయారయ్యాడు!

ఈ రోజు ఈ స్టాపులో ఒక పల్లెటూరి మనిషి తప్ప ఎవ్వరూ లేరు. అందుకే అతడు మరీ రెచ్చిపోతున్నాడు! తను కొద్దిసేపు ఇక్కడుంటే తనని ఎత్తుకెళ్ళి మోటార్ సైకిల్ మీద కూర్చోబెట్టుకునేట్లున్నాడు. అనుకుని లత మాట్లాడకుండా ముందుకు అడుగేసింది.

"మేడమ్! మీకిది న్యాయమా, ఈ దీనుడిని ఒంటరి వాడిని చేసి వెళ్ళిపోతున్నారా, ఈ చల్లని సాయింత్రాన్ని వృధా చేస్తారా?"

అతడంటున్నాడు.

లత విననట్లు నడవసాగింది.

అంతవరకూ అతడి వ్యవహారాన్ని గమనిస్తున్న ఆ పల్లెటూరి వ్యక్తి కల్పించుకున్నాడు!

"ఎందుకు బాబూ! ఆ అమ్మాయిని అలా అల్లరి పెడతావ్! పాపం ఆడపిల్ల-అమాయకురాల్లా వుంది.నీమాటలకెలాబెదిరిపోతోందో చూశావా!"

దాని కతడు పెళ్ళున నవ్వాడు.

"వీళ్ళు అమాయకులా! కాదండీ బాబూ! గుండేలు తీసిన బంటులు" మీరు పల్లెటూరివారు. మీకీ పట్నవాసపు ఆడ పిల్లల గురించి తెలీదు. ఉద్యోగాలు చేస్తున్న ఆడపిల్లల్ని చూసి జాలి పడకండి.వీళ్ళు వుద్యోగాలు చెయ్యడం విచ్చలవిడిగా తిరగడానికి సుఖాలు పొందడానికి, ఈ అమ్మాయిని చూడండి' ఎంత చక్కగా తయారయిందో? ఇప్పటికి ఎంతమందితో తిరిగిందో!....మొదట్లో ఏదో కొద్దిగా బెట్టు చేస్తోంది. రేపీపాటికి వచ్చి నా ఒళ్ళో వాలకపోతే చూడండి....." అన్నాడు మోటార్‌సైకిల్ స్టార్టు చేస్తూ.

లత ఇక వినలేక చకచకా అడుగులు వేసింది!

నాలుగు రోజులు గడిచాయి.

ఒకరోజు సాయంత్రం లత మామూలుగా బస్సుస్టాపు దగ్గర నిలబడింది.

అతడు మోటార్‌సైకిల్ మీద వచ్చి లత కెదురుగా ఆగాడు.

"హల్లో మేడమ్" ఇవ్వాళయినా నా కోరిక తీరుస్తారా! నా వెనక సీటు మిమ్మల్ని ఆహ్వానిస్తోంది, నాలాగా అది కూడా మీకోసం తహతహలాడుతోంది!

లత ఒక్కక్షణం సందేహించింది. చుట్టూ చూసి చటుక్కున వచ్చి అతడి వెనకాల కూర్చుంది.

అతడు మొదట బిత్తరపోయాడు. ఆ తర్వాత ఆనందంతో 'హుర్రే' అని కేకపెట్టాడు.

స్టాపులోని వాళ్ళు లత వేపు ఆశ్చర్యంగా చూశారు.

మోటార్ సైకిల్ వాయువేగంతో వెడుతోంది. లత అతడికి తగలకుండా కూర్చోడానికి ప్రయత్నిస్తోంది.

"మంచి హోటల్‌కి వేడుదామా డియర్", అన్నాడతడు.

'హోటల్‌కెందుకు డబ్బుదండగ మా ఇంటికి వెడదాం",అంది లత.

"మీ ఇంట్లో ఎవ్వరూ లేరా!"

"వూహూ!"

"అయితే పద! మీ ఇంట్లోనే ఈ రాత్రి స్వర్గసుఖాలు చవి చూద్దాం!"

వుషారుగా ఈల వేస్తూ లత చెప్పిన దారి వెంట పోనిస్తూ -కొద్దిసేపటికి లత ఇంటి ముందు ఆపాడు!

అదొకచిన్నపెంకుటిల్లు. జీర్ణావస్థలో వుంది.

"రండి" లత నవ్వుతూ ఆహ్వానించింది. మోటార్ సైకిలుకు స్టాండు వేసి ఆమె వెంట నడిచాడతడు.

తలుపు తట్టింది.

రెండు నిముషాలకు తలుపులు తెరుచుకున్నాయి! అతడికి ఇంటినిండా మనుషులు కన్పించారు. వాళ్ళని చూసి వులిక్కిపడ్డాడు. భయం కూడా కలిగిందతనికి!

"రండి! అక్కడే ఆగిపోయారే," లత పిలిచింది. ఇక చేసేది లేక భయం భయంగా లోపలికి వెళ్ళాడు. లత ఇంట్లో అందరినీ అతడికి పరిచయం చేసింది.

"చెల్లీ వీరికి కాఫీ తీసుకురా!" అని అతడిని ముందు హాల్లో కుర్చీ వేసి కూర్చోబెట్టింది.

చూశారా ! ఇది నా సంసారం. నా తండ్రికి యాక్సిడెంట్‌లో కాలు పోయింది. దాని వలన ఆయన వుద్యోగం పోయింది. ఇంటికి పెద్దకూతురిని కాబట్టి ఇంటి బాధ్యత తీసుకున్నాను. అమ్మకి అనారోగ్యం , చెల్లికి పోలియో వచ్చి ఒక కాలు చచ్చుపడి పోయింది. తమ్ముళ్ళు చిన్నవాళ్ళు- చదువుకుంటున్నారు. నేను వుద్యోగం చెయ్యకపోతే వీళ్ళందరూ మలమల మాడిపోతారు. నేను వుద్యోగం చేసేది వీళ్ళందరినీ బ్రతికించ డానికి గానీ- మీరనుకుంటున్నట్లు విచ్చలవిడిగా తిరగడానికి గానీ-సుఖాలు తీర్చుకోడానికి గానీ కాదు! ఇంకో విషయం అందంగా అలంకరించుకుంటున్నా నన్నారు.. అందం

దేవుడిచ్చింది ఇక అలంకరణ అంటారా, శుభ్రంగా వుండకపోతే మా ఆఫీసరు వూరుకోడు. అందుకే వీలైనంత వరకూ నా చీర చిరుగుల్ని దాచుకుంటూ శుభ్రంగా వుండటానికి ప్రయత్నిస్తాను ఇది కూడా తప్పేనా! చెప్పండి. మమ్మల్నందర్నీ మీరు పోషిస్తానంటే నేను ఇంట్లోంచి కాలు బయట పెట్టను! చెప్పండి, పోషిస్తారా?" అనడిగింది లత

అతడికి తల తిరిగిపోయింది గాలిలేని ఇనుప పంజరంలో బంధించినట్లు వుక్కిరిబిక్కిరయ్యాడు! క్షణం కూడా అక్కడ కూర్చో లేక పోయాడు. చటుక్కున లేచి బయటికొచ్చాడు

"అరె! వెళ్ళిపోతున్నారే! కాఫీ తీసుకోండి", లత వెనక నుండి అంటున్నా విన్పించుకోకుండా మోటార్సైకిలు మీద వెళ్ళిపోయాడు!

* * * * *

నెలరోజులు గడిచాయి

ఒక నాటి సాయంత్రం వేళ లత తమ్ముడిని తీసుకుని బజారుకు బయలుదేరింది

కొద్ది దూరం నడిచేసరికి 'అతడు' ఎదురొచ్చాడు



"నమస్తే మేడమ్", అన్నాడు

లత అతడి వీపు చూసి, ఆశ్చర్యపోయింది హిప్పీ క్రాఫు లేదు కళ్ళకు గాగుల్స్ లేవు. నోట్లో సిగరెట్ లేదు మోటార్ సైకిల్ లేదు సాదాబట్టల్లో వున్నాడు

"నన్ను చూసి ఆశ్చర్యపోతున్నారా! ఈ మార్పుకి కారణం మీరే! మేడమ్ మీరే నాకళ్ళు తెరిపించారు మీ సంసారం లాటిదే నాదీను. నాకు తండ్రి లేడు నేనే ఇంటికి పెద్ద కొడుకుని, కానీ మీలా కాదు! బాధ్యతలు మరిచిన వాడిని, అమ్మ మిషన్ కుట్టి -చెల్లాయిలు బట్టలషాపుల్లోనూ పని చేసి సంపాదిస్తోంటే తిని, అద్దె మోటార్ సైకిల్ మీద తిరిగే దుర్మార్గుడిని, వాళ్ళు రక్తాన్ని చెమటగా మార్చి సంపాదిస్తోంటే - నేనా రూపాయిల్ని సుఖాలకోసం వెచ్చించే రాక్షసుడిని, మీరు నాకు నా బాధ్యత తెలియ చెప్పారు నేను వారం రోజులు తిరిగి అతి కష్టం మీద వుద్యోగం సంపాదించుకున్నాను. చిన్నదే అనుకోండి అయినా నా కుటుంబానికి నా వంతు ధర్మం నెరవేరుస్తున్నందుకు ఆనందంగా వుంది నిన్ననే నా మొదటి నెల జీతం తీసుకున్నాను! ఈ విషయం మీకు చెప్పాలనే వస్తున్నాను లతగారూ, మీకభ్యంతరం లేకపోతే ఆ చిన్న హోటల్లో కెళ్ళి ఒన్‌బై టు కాఫీ తాగుదాం అంతకంటే ఈ చిరుద్యోగి మీకేం ఇచ్చుకోలేడు వస్తారా!' అనడిగాడతడు

లతకు క్షణకాలం నోట మాట రాలేదు అతడిలోని మార్పు ఆమెకు ఆశ్చర్యాన్ని , ఆనందాన్ని కలిగించింది

'మీకు రావడం ఇష్టం లేదా" సందేహంగా అడిగాడు

లత తేరుకుని 'అబ్బే! అదేం లేదండి! తప్పకుండా వస్తాను. పదండి!" అంటూ వుత్సాహంగా అతడి వెంట నడిచింది లత! □